

కారు రేసులో వీరే..

ఈసారి జరిగే శాసనసభ ఎన్నికల్లో పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాల బరిలో పోటీకి బీఆర్ఎస్ పార్టీ తరపున సిట్టింగ్ అభ్యర్థులకే పార్టీ టికెట్లు లభించాయి. చార్మినార్–మహ్మద్ సలావుద్దీన్ లోధి, యాకుత్‌పురా–సామ సుందర్‌రెడ్డి, బహదూర్‌పురా–మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, చాంద్రాయణగుట్ట–ముప్పిడి సీతారాం రెడ్డి ఈసారి కూడా పోటీ చేయనున్నారు. కార్వాన్ నియోజకవర్గానికి కొత్తగా జియగూడ మాజీ కార్పొరేటర్ ఐందల కృష్ణకు బీఆర్ఎస్ బెర్త్ ఖరారైంది.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం

నియోజకవర్గం: చార్మినార్



పేరు: మహ్మద్ సలావుద్దీన్ లోధి
వయస్సు: 60
విద్యార్హత: ఇంటర్మీడియట్
కుటుంబం: భార్య, కూతురు
స్వస్థలం: పురానీహవేలి
రాజకీయ నేపథ్యం: 1985 నుంచి టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా కొనసాగి పార్టీలో పలు పదవులను నిర్వహించారు.

ఇప్పటి వరకు నిర్వహించిన పదవులు: 2018లో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన అదే ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం చార్మినార్ శాసన సభ నియోజకవర్గం ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు చార్మినార్ నుంచి రెండోసారి పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.

కార్వాన్



పేరు: ఎ.కృష్ణయ్య, ఎలియాస్ మిత్ర కృష్ణ
తండ్రి: సీతయ్య , పుట్టిన తేదీ: 16–04–1959
కులం: ఎస్సీ (మాదిగ)
విద్యార్హత: బీకాం. ఎల్.ఎల్.బి
అనుభవం: రెండు పర్యాయాలు జియాగూడ కార్పొరేటర్‌గా సేవలు, బల్దియా స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యుడు.
వ్యక్తిత్వం: వివాద రహితుడుగా అందరి మన్ననలు.

చేసిన అభివృద్ధి పనులు..

- జియాగూడ స్లాటర్‌హౌజ్ ఆధునీకరణకు రూ.28 కోట్లు మంజూరు.
- జియాగూడలో 840 డబుల్‌బెడ్‌రూమ్‌ల నిర్మాణం.
- జియాగూడలో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు.
- జియాగూడలో కమ్యూనిటీహాళ్ల నిర్మాణం.
- కరోనా సమయంలో నిరుపేదలకు అండగా సేవా కార్యక్రమాలు, నిత్యావసరాల పంపిణీ.
- వలస కూలీల ఉపాధి కల్పనకు కృషి.
- రెండు దశాబ్దాలుగా జియాగూడలో విద్యాప్తికి కృషి.
- నిరుపేద కుటుంబాల అమ్మాయిల పెళ్లికి ఆర్థిక సాయం.
- ప్రతిభగల విద్యార్థులకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా వికాస్ అవార్డ్స్.
- రాజకీయాలకు అతీతంగా జియాగూడ అభివృద్ధికి కృషి.

బహదూర్‌పురా



పేరు: మీర్ ఇనాయత్ అలీ బాక్రీ.
వయస్సు: 53
విద్యార్హత: బీఏ.
వృత్తి : ప్రైవేటు ఐటీఐ ప్రిన్సిపాల్.
కుటుంబం: భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు.
స్వస్థలం: కోట్లాఆలిజా, చార్మినార్.

రాజకీయ నేపథ్యం: 2009–2013 వరకు సెట్విన్ డైరెక్టర్‌గా పని చేశారు. 2014లో బీఆర్ఎస్ చార్మినార్ ఎమ్మెల్యే అభ్యర్థి, 2018లో సైతం బహదూర్‌పురా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం బహదూర్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ టికెట్టు లభించింది.

నియోజకవర్గం: చాంద్రాయణగుట్ట



పేరు: ముప్పిడి సీతారాంరెడ్డి.
వయసు: 55 , విద్యార్హత: బీఏ
సామాజిక వర్గం: రెడ్డి.
కుటుంబం: భార్య శోభారెడ్డి, ఒక కుమార్తె గ్రీష్మారెడ్డి.
స్వస్థలం: కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిన్న ముల్కనూర్ గ్రామం

రాజకీయ నేపథ్యం: 2001లో సీఎం కేసీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచి సభ్యుడిగా ఉన్నారు. 2002లో గౌలిపురా డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేశారు. 2014, 2018లో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2016లో జంగమ్మెట్ కార్పొరేటర్‌గా కూడా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు.

ఇప్పటి వరకు నిర్వహించిన పదవులు: ప్రస్తుతం పార్టీ చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి, రాష్ట్ర మాజీ కార్యదర్శిగా పనిచేశారు.

యాకుత్‌పురా



పేరు: సామ సుందర్‌రెడ్డి.
తండ్రిపేరు: సామ శంకర్‌రెడ్డి.
పుట్టిన తేదీ: 24 ఏప్రిల్ 1978
విద్యార్హత: ఇంటర్మీడియట్.
కుటుంబం: భార్య సామ స్వప్న సుందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ (ఐ.ఎస్.సదన్ డివిజన్). మాజీ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, ఇంటర్నేషనల్ వాలీబాల్ ప్లేయర్.
సంతానం: సామ చరణ్‌రెడ్డి, సామశ్రీ హరన్‌రెడ్డి.
స్వస్థలం: మల్లారెడ్డి కాంప్లెక్స్, కేశవనగర్, చంపాపేట్, సాగర్‌రింగ్ రోడ్డు, హైదరాబాద్.

రాజకీయ నేపథ్యం

- పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకులకు సమయానుకూలంగా గుర్తింపు లభిస్తుంది.
- 2016లో పార్టీలో చేరి పార్టీ అధి నాయకత్వం ఆదేశాల మేరకు పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేశాడు.
- పార్టీకి అందించిన సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ 2018 ఎన్నికల్లో యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి టికెటు కేటాయించడంతో ఈ ఎన్నికల్లో పోటీచేసి 24 వేల పైచిలుకు ఓట్లు సాధించాడు.

క్లుప్తంగా...

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్‌హెచ్ఎం (నేషనల్ హెల్త్ మిషన్)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని తెలంగాణ ఎన్‌హెచ్ఎం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కన్వీనర్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్యుల మాదిరిగానే మాకు కూడా వెయిటేజీ ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు. ఈ ధర్నాలో వర్కిగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సామీ, ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్, ట్రెజరర్ తిరుమలరెడ్డి, ఫార్మసిస్ట్ రంజిత్, శంకర్, శ్రీనివాసరావు, వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డీహెచ్. డాక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

‘ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే గిరిజన మహిళను చితకబాదడమా?’



గౌరీ సతీష్

అబిడ్స్: ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఒక గిరిజన మహిళను చితకబాదడమా అని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ప్రశ్నించారు. ఎల్బీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో గిరిజన మహిళను రాత్రివేళ అక్రమంగా నిర్బంధించి పోలీసులు చితకబాదడం ధారుణమన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన మహిళను చితకబాదిన పోలీసులపై కేసులు నమోదు చేసి వారిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీ కుమార్ గిరిజన మహిళను చితకబాదిన పోలీసులను డిస్మిస్ చేయడంతో పాటు మహిళా కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆయన గోషామహల్ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు అందజేశారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. గోషామహల్‌లో బీఆర్ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడిస్తామన్నారు. మాయ మాటలు చెప్పే బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మలేరన్నారు.

నాంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

విజయనగర్‌కాలనీ: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి నాంపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆసీఫ్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లెపూల విద్యాసాగర్ సోమవారం హోంమంత్రి మహమూద్ అలీకి వినతిపత్రం అందజేశారు. కాంటెస్టెడ్ కార్పొరేటర్ సాయిశిరీష, లక్ష్మమ్మ, లలిత, గోపా అభిషేక్‌రాజ్, విక్కి ఉన్నారు.

తెలంగాణలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ పూంజా

గౌలిపురా: తెలంగాణ లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని కర్ణాటక మంగుళూరు జిల్లా బెల్తాన్‌గడి బీజేపీ ఎమ్మెల్యే హరీష్ పూంజా ధీమా వ్యక్తం చేశారు. గౌలిపురా డివిజన్‌లోని ఆరె కటిక భవనంలో సోమవారం ఎమ్మెల్యే ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జిగా హరీష్ పూంజాను నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ జితేంద్ర, నాయకులు రూప్‌రాజ్, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, యాకుత్‌పురా నియోజకవర్గం కన్వీనర్ ధీరజ్‌లాల్, జిల్లా అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభ్యున్నతికి కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంచార జాతుల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర వీరభద్రీయ సంఘం 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అత్యంత వెనుకబడిన వర్గాలు, సంచార జాతులకు ఆత్మగౌరవ భవనాలను, స్థలాలను కేటాయించి వారికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. వెనుకబడిన సంచార జాతులు ఐక్యంగా ఉన్నప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని సూచించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటపల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. తమ జాతికి శాశ్వత పేదరిక నిర్మూలన పథకాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కొండయ్య, కల్యాణి, క్రాంతికుమార్, శివరాజ్ పాల్గొన్నారు.



గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాల్లో ఉత్కంఠ

అబిడ్స్: గోషామహల్, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ టికెట్లను సీఎం కేసీఆర్ ప్రకటించకపోవడంతో కార్యకర్తలు, నాయకులు, ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ చోటుచేసుకుంది. గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ కోసం బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్, మమతాగుప్తా, ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్‌సింగ్ రాథోడ్, ఆశీష్‌కుమార్‌యాదవ్, ముఖేష్‌సింగ్‌తో పాటు పలువురు నాయకులు పెద్ద ఎత్తున ఆశిస్తున్నారు. తమకే టికెట్ ఖరావుతుందని సోమవారం ఉదయం నుంచి వారి అనుచరులు, వారి అభిమానులు టీవీల వద్ద అత్తుక్కుని ఉండిపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సీఎం కేసీఆర్ గోషామహల్‌తో పాటు నాంపల్లి నియోజకవర్గాల అభ్యర్థులను పరిశీలించి ప్రకటిస్తామని చెప్పడంతో అందరూ డీలా పడిపోయారు. అదేవిధంగా నాంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ టికెట్ కోసం సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్, అశ్విని మార్గం, బంగారి ప్రకాష్ తీవ్రంగా ఆశిస్తున్నారు. నాంపల్లి నియోజకవర్గం టికెట్ కూడా ప్రకటించకపోవడంతో వారితో పాటుగా వారి అనుచరులంతా మనోవేదనకు గురయ్యారు.

ఎంపీ ఆర్.కృష్ణయ్యకు సన్మానం



ఎంపీ ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న దామోదర్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఆర్ట్స్ అకాడమి, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జయహో పోలీస్ పేరిట సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పలువురు పోలీసులు ఉన్నతాధికారులకు ప్రైడ్ ఆఫ్ ఇండియా పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు అంకితం ఇస్తూ గాయని గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండ్డారు సుబ్బారావు శృతిలయ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక కార్యదర్శి ఆమని, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

దర్బార్ మైసమ్మకు పూజలు

జియాగూడ: కార్వాన్ అసెంబ్లీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మిత్ర కృష్ణ పేరు ఖరారు కావడంతో కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలోనే మొదటిసారి సీఎం కేసీఆర్ దళితుడైన తనకు కార్వాన్ టికెట్ కేటాయించడం హర్షనీయమన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో దాదాపు అన్ని డివిజన్లల్లో సుమారు 68 వేలకు పైగా దళితుల ఓట్లు ఉన్నాయని, అలాగే బీసీ, మైనారిటీ ఓట్లు కూడా తనకే పడతాయని తెలిపారు.



పూజలు చేస్తున్న కార్వాన్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

రాంరెడ్డికి శుభాకాంక్షలు



రాంరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ పార్టీ చాంద్రాయణగు ట్ట నియోజకవర్గం అభ్యర్థిగా ముప్పిడి సీతారాంరెడ్డి పేరు ప్రకటించడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రకటన వెలువడిన అనంతరం జమ్మిచెట్టు రాజు, శోభారెడ్డి, గిరిధర్ నాయక్, నరేష్ తదితరులు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న జీవన్‌సింగ్

గోల్కొండ: కార్వాన్‌లోని టప్పా మైసమ్మ ఆలయంలో దేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలు ఉదయం 8 గంటల వేద స్వస్తి ఆవాహిత దేవత పూజా, గర్త న్యాస, రత్నన్యాస, ధాతున్యాస, పూర్వక హోమం, పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 10.25 గంటలకు చిత్తానక్షత్ర పుష్కారాంచ నముహూర్తమున యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, మహాబలి, మహాపూర్ణాహుతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు మహాదార్శిర్వనం, బ్రాహ్మణ సత్కారం తదితర కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవన్‌సింగ్, బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

గోల్కొండ: వర్షాకాలం ముగుస్తున్నా అధికారులు బాక్స్ టైప్ డ్రైనేజీ పనులను పూర్తి చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఎస్ఎన్‌డీపీ అధికారులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో నాలాలు, బాక్స్ టైప్ డ్రైనేజీ పనులపై మాట్లాడారు. ప్రజలను వరద ముంపు నుంచి కాపాడడానికి కార్వాన్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే ఆ పనులను సకాలంలో పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. ముఖ్యంగా నానల్‌నగర్ డివిజన్ నిజాం కాలనీలో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు గతేడాది వర్షాకాలం ముందు ప్రారంభమయ్యాయని అయితే ఆ పనులు నత్తనడన సాగి నిజాం కాలనీతో పాటు టోలిచౌకి చౌరస్తాకు శాపంగా మారిందన్నారు. పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తనను నిలదీస్తున్నారని వారికి సమాధానం చెప్పలేక తాను ఇబ్బందులు పడావాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఎస్ఎన్‌డీపీ ఈఈ శ్రీధర్, డిప్యూటీ ఈఈ సునీల్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విజేతలతో జీహెచ్ఎస్ హెచ్ఎం బషీరుద్దీన్ తదితరులు

గోల్కొండ: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని గోల్కొండ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. గోల్కొండ మండల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలైన గోల్కొండ అలయన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ టీమ్‌కు సోమవారం ఆయన గోల్కొండ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో బహుమతులు అందజేశారు. గోల్కొండ క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో 16 టీమ్‌లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో అలయన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ మెరిడియన్ హైస్కూల్‌ను ఓడించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా బషీరుద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రికెట్ పోటీలే కాకుండా సాంప్రదాయ క్రీడల్లో పట్ల ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్‌పాషా, అలయన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ ఆరీఫ్ తదితరులున్నారు. అలయన్స్ స్కూల్ క్యాప్టెన్ ఉమర్‌ఖాన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును, ఉఫీయాన్‌ఖాన్ మ్యాన్ ఆఫ్ ది సిరిస్ అవార్డులను గెలుచుకున్నారు.

ఆచార్య కోవెల సంపత్‌కుమారాచార్యకు నివాళి



నివాళులర్పిస్తున్న కేవీ రమణాచారి, తంగెడ కిషన్‌రావు

నాంపల్లి: చంధస్సు, అలంకారశాస్త్రం, వచనపద్యం మూడు నామాలుగా ఆచార్య సంపత్‌కుమారాచార్యుల ముఖారవిందంపై కళాకాంతులను విరజిమ్మాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. చంధశ్శాస్త్రాలంకారులు ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య స్మారకోపన్యాసం సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేవీ రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన ప్రసంగించారు. కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య కాత్యాయని విద్మహే హాజరై సంపత్కుమార సాహిత్య విమర్శ విలువలు అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగువర్సిటీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు కోవెల సంపత్కుమారాచార్యులు తెలుగు సాహిత్యానికి, చంధశ్శాస్త్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణాచార్యులు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో మెట్రో కోసం మరోసారి ఆందోళనలకు సిద్ధం



సమావేశంలో పాల్గొన్న జాక్ నేతలు

చార్మినార్: పాతబస్తీలో మెట్రో రైలు సాధన కోసం జేఏసీ మళ్లీ ఆందోళనకు దిగనుందని జాక్ నేతలు ప్రకటించారు. ఆదివారం రాత్రి మొఘల్‌పురా ఉర్దూఘర్‌లో పాతబస్తీ మెట్రో రైలు జేఏసీ నేతలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత జూలైలో ఓల్డ్ సిటీలో మెట్రో రైలు పనులకు సన్నాహకాలు షురూ చేస్తున్నట్లు నెల రోజుల్లో భూసేకరణకు నోటీసులు జారీ చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేసినా.. నేటికీ పాతబస్తీలో మెట్రో కోసం ఎలాంటి పనులు ప్రారంభం కాలేదన్నారు. ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజిరీ, ఇ.టి.నర్సింహ, కె.వెంకటేశ్, మూసా ఖాసీం, హైదర్ జాఫ్రీ, మహ్మద్ సలీం, మునీర్ పటేల్, మహ్మద్ ఖలీల్, మక్బూల్ అల్ హజిరీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

అబిడ్స్: నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పుట్టలకు భక్తులు పాలు పోసి పూజలు చేశారు. అబిడ్స్ పరిశ్రమల భవన్‌లో వేలాది మంది భక్తులు పుట్టకు పూజలు నిర్వహించారు. నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

ఇబ్లీబన్ పార్కులో..

అఫ్జల్‌గంజ్: ఇబ్లీబన్ పార్కులోని రేణుకా ఎల్లమ్మ, నాగదేవత ఆలయంలో సోమవారం నాగుల పంచమిని ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ గౌంటి శంకర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అశోక్‌యాదవ్, శ్యామ్ యాదవ్, ఆంజనేయులు, గెల్లబోయిన అశోక్‌కుమార్ యాదవ్, సల్ల సత్యం యాదవ్ పాల్గొన్నారు.

వివేకనందనగర్‌లో..

గౌలిపురా: నాగుల పంచమిని పురస్కరించుకొని వివేకనందనగర్‌లోని శివనాగ లింగేశ్వర ఆలయంలో సోమవారం శివలింగానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్, టీడీడీ బోర్డు మెంబర్ (ఎమ్మెల్సీ) మోహన్ కుమార్ గౌరీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దారుషిఫాలో..

డబీర్‌పురా: దారుషిఫా ప్రాంతంలోని నాగదేవత ఆలయంలో సోమవారం నాగుల పంచమిని పురస్కరించుకొని నాగదేవతకు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగదేవత పుట్టలో పాలు పోశారు.



దారుషిఫా ప్రాంతంలో నాగదేవతకు పూజలు



పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ శంకర్‌యాదవ్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మోహన్ కుమార్ దంపతులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684